క్లుప్తంగా

ఘనంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి జూబిలీహిల్స్ కాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం ఘనంగా జరిపించారు. ఉదయం ఆరు గంటల నుంచి విశేష పూజలు చేశారు.పరమశివునికి కృష్ణారావు దంపతులు అభిషేకం చేశారు.సూర్యనారాయణ, గొల్లవిల్లి వెంకటరావు, సత్యారావు, ప్రసాద్, శ్రీదేవి తదితరుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు.

రామారావు సేవలు మరువలేం



రామారావు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్

పెదగంట్యాడ: కమ్యూనిస్ట్ పార్టీ నేతగా, ఉక్కు నిర్వాసిత నాయకుడిగా ఎల్లేటి రామారావు సేవలు అద్భుతమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు, కార్పొరేటర్ ఏజె స్టాలిన్ అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో రామారావు వర్ధంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు చీరలు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్లేటి శ్రీనివాసరావు, కసిరెడ్డి సత్యనారాయణ, ఆనంద్, పులి వెంకటరమణారెడ్డి, మంత్రి గోపి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో ఆధార్ సేవలు



ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 78వ వార్డు సెక్టార్-1 షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 వరకు నిర్వహించనున్న క్యాంప్‌లో కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్‌లో పేరు, వయస్సు, మొబైల్, జెండర్, పుట్టిన తేదీల్లో తప్పుంటే సరిచేసుకోవచ్చన్నారు. అదే విధంగా ఫొటో, డాక్యుమెంట్ అప్‌డేషన్, బయోమెట్రిక్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి టి. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగి కుటుంబానికి పరామర్శ



వెంకటరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: సింహాచలం చందనోత్సవం రోజు మృతి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి యడ్ల వెంకటరావు కుటుంబ సభ్యులను సోమవారం స్టీల్ ఇంటక్ నాయకులు పరామర్శించారు. గోడకూలిన ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1 జనరల్ ఫోర్‌మెన్ వెంకటరావు మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు పి.వి. రమణమూర్తి వెంకటరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు.

భెల్ భూముల పరిరక్షణకు గెజిటెడ్ అధికారి

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్ భూముల పరిరక్షణకు గెజిటెడ్ స్థాయి అధికారిని నియమించేందుకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ చట్టం 1971 ప్రకారం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఈ నెల 1న గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒకప్పటి చినగంట్యాడ పంచాయతీ పరిధిలోని తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది సరిహద్దులతో ఉన్న సంస్థకు చెందిన 381 ఎకరాల భూమి ఉంది. ఆభూములకు రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకోనున్నారు.



ఐటీఐ పిలుస్తోంది

- ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 24 తుది గడువు

పెదగంట్యాడ: పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు.. అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు పారిశ్రామిక సంస్థలు సిద్ధమయ్యాయి. దానిలో భాగంగా స్టీల్ సిటీ న్యూ ఐటీఐ పదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వివిధ ట్రేడుల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు.. ఈ నెల 24లోగా ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నారు..



పెదగంట్యాడలోని ప్రభుత్వ స్టీల్ సిటీ న్యూ ఐటీఐ ముఖద్వారం



జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు(ఫైల్)



ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఉపాధికి ఊతం

యువతకు ఉపాధి కల్పించేందుకు సాంకేతిక విద్యాశాఖ, పారిశ్రామిక శిక్షణ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లు ఏర్పాటయ్యాయి. ఐటీఐలో వివిధ ట్రేడుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారు అప్రెంటిస్ చేస్తున్నారు. ఆపై ప్రతిభ చూపి ఉపాధి అవకాశాలను అవలీలగా దక్కించుకుంటున్నారు.

డ్రైవింగ్ స్కూల్‌లో స్వల్పకాలిక కోర్సు

ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్ లో,లైట్ మోటార్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తారు. పదో తరగతి పాసై ఉండాలి.అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి.45 రోజుల పాటు శిక్షణ ఉంటుంది.

పదో తరగతి పాసైన తర్వాత..

పదో తరగతి పాసైన తర్వాత ఏఏ కోర్సులు చేయాలనే దానిపైనే విద్యార్థులు ఎక్కువగా దృష్టి పెడతారు. ఆర్థికంగా బాగా ఉన్న వారు ఇంటర్‌లో చేరడానికి ఆసక్తి చూపగా.. దారిద్ర్యరేఖకు దిగువున్న వారంతా సాంకేతిక విద్య ద్వారా పాలిటెక్నిక్ కోర్సు, ఐటీఐలో చేరుతుంటారు. పదో తరగతి తర్వాత త్వరగా ఉపాధి పొందేందుకు ఐటీఐ చేసిన వారికి చక్కని అవకాశాలు లభిస్తాయి.

రెగ్యులర్ కోర్సులు

ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాల పరిమితితో రెగ్యులర్ కోర్సులు ఉన్నాయి.రెండేళ్ల కాలపరిమితిలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మిషనిస్ట్,మిషన్ టూల్ మెయింటెనెన్స్ మెకానిక్, ఎలాక్ట్రానిక్ మెకానిక్, టర్నర్ మోటర్ మెకానిక్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాల పరిమితితో డీజిల్ మెకానిక్, ప్లంబర్, వెల్డర్, వుడ్‌వర్క్ టెక్నిషియన్, షీట్ మెటల్, మేషన్ , టూల్స్ మెయింటెనెన్స్ మెకానిక్, కంప్యూటర్ ప్రోగ్రాం అసిస్టెంట్ కోర్సులు ఉంటాయి.

కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత

వివిధ ట్రేడుల్లో ప్రవేశం కోసం చేసిన విద్యార్థులను దరఖాస్తులను పరిశీలించిన తర్వాత కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. అడ్మిషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. కౌన్సిలింగ్ ద్వారా ఎంపిక చేస్తారు.. ఆపై తరగతుల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటిస్తారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు



ఐటీఐలో ప్రవేశాలకు నిర్ణీత గడువులోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏడాది, రెండేళ్ల కోర్సులు పూర్తి చేసుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నాం. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నాం. నాలుగేళ్లలో ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు పలు పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాం. గత సంవత్సరంలో జాబ్ మేళాలు, అప్రెంటీస్ మేళాల ద్వారా 444 మందికి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైయివేట్ లిమిటెడ్, అమర్‌రాజా బ్యాటరీస్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, జాన్‌సన్స్ లిఫ్ట్, సర్వోమెధా హైదారాబాద్, హోండాయి మోటార్స్ లిమిటెడ్, ఎల్ అండ్ టి, జైవై సాఫ్ట్‌వేర్స్ సొల్యూషన్స్, టెక్ మహేంద్ర, హెచ్‌పీసీఎల్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా తదితర కంపెనీల్లో ఉపాధి , ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

-కేఎస్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, స్టీల్ సిటీ న్యూ ఐటీఐ

ఉద్యోగ అవకాశాలు

ఐటీఐ తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పలు పరిశ్రమలకు అవసరమైన వారి కోసం ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు ఐటీఐల్లోనే ఉద్యోగ మేళాలు నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం కనబర్చిన విద్యార్థులకు మంచి మంచి అవకాశాలు కల్పిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐలో స్కిల్స్ హబ్స్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. దీంతో ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి ఐటీఐలు ఊతమిస్తున్నాయి.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు

అగనంపూడి: వాకింగ్ ట్రాక్ అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకు బీఎన్ఆర్ చారిటబుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు అందిస్తున్న సహకారం అభినందనీయమని అగనంపూడి వాకింగ్ ట్రాక్ అధ్యక్ష, కార్యదర్శులు మడగల నరసింగరావు, బి.రామారావు అన్నారు. జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి వాకింగ్ క్లబ్ బయట బలిరెడ్డి నాగేశ్వరరావు ఆర్థికక సహాయంతో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గతంలో వాకింగ్ ట్రాక్ వర్షాలకు పాడైతే మరమ్మతులు చేయించారని, వాకర్స్‌కు టీ షర్టులు అందించారని, నేడు వాకర్స్‌తోపాటు ఈ మార్గంలో ప్రయాణించే వందలాది మంది ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, చిన్ని పూర్ణ, కిషోర్ బాబు, కరణం పైడిరాజు, సింహాచలం నాయుడు, వెంకటేశ్వరరావు, జెర్రిపోతుల అప్పారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగికి సత్కారం



బ్రహ్మం దంపతులను సత్కరిస్తున్న ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: ఆర్టీసీ ఉద్యోగిగా అధికారులు, సిబ్బంది మన్ననలు పొంది, ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధిగా గ్రామస్తుల ఆదరాభిమానాలు చూరగొన్న బ్రహ్మం సేవలు మరువలేనివని దేవాలయ కమిటీ ప్రతినిధులు కొలిపాక అప్పారావు, దానబాల అప్పలనాయుడు, గెద్దాడ అప్పలరాజు అన్నారు. ఆర్టీసీలో 32 ఏళ్ల విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన దివిలి బ్రహ్మం దంపతులను సోమవారం పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో అమరపిని సోమేశ్వరరావు, లోవరాజు, కరణం సన్ని, దొడ్డి దేముడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు



డాక్టర్ కిరణ్ కుమార్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న యూనియన్ నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నట్టు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు గాజువాక సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, భద్రతా పరికరాలు, పనిముట్లు సరఫరా చేయాలని, రిటైర్మెంట్, డెత్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, ఆప్కాస్ వర్కర్ల మిస్సింగ్ జీతాలు, డైలీవేజ్ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించాలన్న డిమాండ్లతో ఈ సమ్మెలో పాల్గొంటున్నట్టు నాయకులు పేర్కొన్నారు. సమ్మె నోటీసును అందజేసినవారిలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, నక్క నాగరాజు, సోమాదుల గణేష్, పద్మ, లక్ష్మణరావు తదితరులు తెలిపారు.

ఆస్తమా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం: మారుతున్న జీవనశైలి, వయస్సుతో సంబంధం లేకుండా ఆస్తమా వ్యాధి ఎవరికైనా సంభవిస్తుందని, అప్రమత్తత అవసరం అని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్.ఫణీంద్ర కుమార్ అన్నారు. అంతర్జాతీయ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్స్ తీసుకోవడం , కాలుష్యం పెరిగిపోవడం, వ్యవసాయదారులు ఎక్కువగా మట్టిలో పనిచేయడం వల్ల మట్టి దుమ్ము ధూళి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం వల్ల ఆస్తమా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నివారణకు... ఆస్తమా ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఏపీఐఐసీ నిర్వాసితులను ఆదుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీఐఐసీ నిర్వాసితులు

కూర్మన్నపాలెం: తమకు న్యాయం చేయాలని ఏపీఐఐసీ నిర్వాసితులైన యాదవ్‌జగ్గరాజుపేట వాసులు కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను కోరారు.ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. నాలుగు దశాబ్దాల కిందట యాదవజగ్గరాజుపేట పరిసర ప్రాంతాల్లో వందలాది ఎకరాలు ఏపీఐఐసీ సేకరించిందని తెలిపారు. తమ భూములు కోల్పోయినా ఇప్పటికీ న్యాయం జరగలేదని వారు వివరించారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి 15.20 ఎకరాల భూమిని కేటాయించినా ఇంత వరకూ ప్లాట్లుగా విభజించి నిర్వాహితులకు కేటాయించలేదని వివరించారు. లబ్ధిదారుల జాబితాలోకూడా అనేక అవకతవకలు ఉన్నాయని వాటిని కూడా సరిచేయాలని కోరారు. ఉక్కు, ఫార్మాసిటీ నిర్వాసితుల మాదిరిగానే 107 లేదా 144 గజాల స్థలాన్ని కేటాయించి ఆదుకోవాలని నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులను గుర్తించి స్థలాలు కేటాయించడానికి సిద్ధమైన తరుణంలో ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎదురు శ్రీనివాసరావు,నమ్మి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పెంచిన పార్కింగ్ ఫీజు రద్దు చేయాలి



స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగాధిపతికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ఉద్యోగుల సౌకర్యార్థం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో పెంచిన ఫీజు రద్దు చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. టౌన్ అడ్మిన్ విభాగాధిపతి చంద్రశేఖర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు 12 గంటలకు రూ. 1, 24 గంటలకు రూ. 2 ద్విచక్ర వాహన ఫీజు కాగా దాన్ని ఒకే సారి రూ. 10, రూ. 20లకు పెంచడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆ ఫీజులు రద్దు చేసి పాత పద్ధతి కొనసాగించాలన్నారు.

డైరెక్టర్ (పర్సనల్)కు సీఐటీయూ వినతి

పెంచిన పార్కింగ్ ఫీజు రద్దు చేయాలని స్టీల్ సీఐటీయూ నాయకులు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్)కు వినతిపత్రం అందజేశారు. నగరం, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు, ఉక్కునగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం పార్కింగ్ షెడ్‌లు ఏర్పాటు చేసి నామమాత్రం చార్జీలు (రూ.1, రూ.2)లు వసూలు చేసేవారన్నారు. వెంటనే కొత్త ఫీజులను రద్దు చేయాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు. రామస్వామి కోరారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న పీఎఫ్, ఎస్ఎబీఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్ఎబీఎఫ్) పెండింగ్ బకాయిలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ పీఎఫ్, ఎస్ఎబీఎఫ్ ట్రస్టుల ప్రతినిధులు ఫైనాన్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ ఝూను కోరారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కె.ఎస్.ఎన్. రావు నేతృత్వంలో కలిసి ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను ఆయనకు వివరించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఎన్‌పీఎస్ అమలు చేయాలన్నారు. పెండింగ్ జీతాలను తొందరలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, కాటం చంద్రరావు, రామచంద్రరాజు, సైనుబాబు, దేముడు, సత్యనారాయణమూర్తి, తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక:మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బీసీ సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన కుట్టు మిషన్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. స్థానిక కైలాసనగర్‌లోని సామాజిక భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తితో రాణించాలన్నారు.శిక్షణ పొందిన పొందినవారికి గుర్తింపు పత్రంతోపాటు అపెరల్ పార్కులో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, నాయకులు మహ్మద్ రఫీ, ప్రసాదుల శ్రీనివాస్, గోమాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు లేవా?

- ఉక్కపోతతో చిన్నారుల విలవిల
- సెలవులు ఊసెత్తని ప్రభుత్వం
- తగ్గుతున్న హాజరు శాతం



వెలవెలబోతున్న అంగన్‌వాడీ కేంద్రం



ఉక్కతో విలవిల్లాడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: ఎండలు దంచికొడుతున్నాయి.. పెద్దలు, చిన్నారుల ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. కానీ చిన్న పిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు పిల్లలను సరిగ్గా కేంద్రాలకు పంపడం లేదు. ఫలితంగా హాజరు శాతం తగ్గుతోంది.

ఇదీ పరిస్థితి

ఐసీడీఎస్ పరిధిలో పెదగంట్యాడ సెక్టార్‌లో 25, ఇస్లాంపేట సెక్టార్ లో 26 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇస్లాంపేట సెక్టార్‌లో 351మంది, పెదగంట్యాడ సెక్టార్‌లో 396మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వలేదు. దీంతో పిల్లలు మండుటెండలో కేంద్రాలకు రావాల్సిన దుస్థితినెలకుంది. మే1 నుంచి అంగన్వాడీ టీచర్లకు నెలలో 15 రోజులు, మరో 15 రోజులు సహాయకులకు సెలవులు మంజూరు చేశారు. ఆరేళ్ల లోపు పిల్లలే ఎక్కువగా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు. ఎండల తీవ్రతకు పిల్లలు సరిగ్గా రావడం లేదని.. హాజరు శాతం తగ్గిందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

అల్లాడుతున్న చిన్నారులు

ఉదయం 8 నుంచే ఎండలు మండిపోతున్నాయి. కేంద్రాల్లో ఫ్యాన్ ఉన్నప్పటికీ గాలి ఆడక ఉక్కపోతతో పిల్లలు అల్లాడుతున్నారు. ఎండ వేడిమికి గర్భిణులు, బాలింతలు కూడా ఇబ్బంది పడుతున్నారు. కిశోర వికాసం పేరుతో రోజుకో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల నష్టాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికి కూడా పెద్దగా స్పందన ఉండడం లేదు.

మాపై ఎందుకు కక్ష సాధింపు

రెండు నెలలు కిందట జీతాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని ఆందోళన చేయడంతో ప్రభుత్వం కక్ష కట్టి ఇలా చేస్తుందని అంగన్‌వాడీలు ఆరోపిస్తున్నారు. ఇబ్బందులను గుర్తించి సెలవులు ప్రకటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కేంద్రం పరిశీలన



బుక్ డిపోను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్ తదితరులు

గాజువాక: గాజువాకలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రం (బుక్ డిపో)ను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ సోమవారం సందర్శించారు. పుస్తకాల పంపిణీకి సంబంధించిన విషయాలను బుక్ డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. బుక్ డిపోకు వచ్చిన పుస్తకాలను ఎప్పటికప్పుడు ఎంఈవో కార్యాలయాలకు చేరే విధంగా చూడాలని డీఈవో సూచించారు. గతంలో 110 టైటిల్స్ ఉన్న పుస్తకాలను ప్రభుత్వం ఇప్పుడు 47 టైటిల్స్‌కు తగ్గించిందని తెలిపారు. వచ్చేనెల 12న పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. పది రోజులుగా పుస్తకాల పంపిణీ కొనసాగుతోందన్నారు. మరో వారం రోజుల్లో మిగిలిన పుస్తకాల పంపిణీ కూడా పూర్తవుతుందన్నారు. బుక్ డిపోను సందర్శించినవారిలో ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, గాజువాక ఎంఈవో సునీత తదితరులున్నారు.